క్లుప్తంగా

తాత్కాలిక మరమ్మతులు



అలుగు వద్ద మొరం పోయిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

కుంటాల: ఇటీవలి వర్షాలకు మండలంలో ని పలు గ్రామాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. దీంతో రాకపోకలు సాగించే ప్రజ లకు పొంచి ఉన్న ముప్పుపై సాక్షిలో బుధవారం రోడ్లకు మరమ్మతులెప్పుడో శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించారు. అందకూర్ అలుగు వద్ద రోడ్డుతోపాటు పలు చోట్ల మొరం పోయించి తాత్కాలికంగా మరమ్మతులు చేయించారు.

22 నుంచి ఉపాధి అవకాశాలపై శిక్షణ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని మహాదేవ శక్తి సంస్థాన్‌లో ఈనెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు సద్గురు శివరాజయోగి కృష్ణ స్వామీజీ మార్గ నిర్దేశకత్వంలో ఉపాధి అవకాశాలపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు రాజశ్యామల పీఠం ప్రధాన అర్చకుడు ఆచార్య వేణు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్చకత్వం, సంస్కార శిక్షణ ఉపాధి అవకాశాలు అనే ప్రధాన అంశంపై శిక్షణ ఉంటుందన్నారు. ఈ శిక్షణతో ట్రస్టులు, ఆలయాల్లో ఉపాధి పొందే అవకాశం ఉంటుందని వివరించారు. పూర్తి వివరాలకు 99085 68568 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రాష్ట్ర కార్యదర్శిగా లావణ్య



నిర్మల్‌టౌన్: జిల్లాకు చెందిన బి.లావణ్యను తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ చైర్మన్ శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరం, సంక్షేమం కోసం కృషి చేయాలని సూచించారు.

ఫాగింగ్ యంత్రం అందజేత



యంత్రం అందిస్తున్న వినయ్

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ గ్రామానికి చెందిన వినయ్‌రెడ్డి హైదరాబాద్‌లో నివసిస్తున్నాడు. బుధవారం గ్రామ రైతు వేదికలో ఏ ర్పాటు చేసిన సమావేశంలో తన వంతుగా రూ.35వేల విలువైన ఫాగింగ్ యంత్రాన్ని గ్రామస్తులకు అందజేశారు. గ్రామ అభివృద్ధికి తన వంతు సహాయం అందిస్తానని హా మీ ఇచ్చారు. ఇందులో దాత వినయ్‌రెడ్డి, నారాగౌడ్, లింగాగౌడ్, నరేశ్‌రెడ్డి, రమణగౌడ్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ

కుంటాల: మండలంలోని కల్లూరు 61 జాతీయ రహదారిపై బుధవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. వాహనదారులు ధ్రువీకరణ పత్రాలను కలిగి ఉండాలని మహిళా కానిస్టేబుళ్లు అనుప్రియ, అశ్విని సూచించారు. సిబ్బంది బాబు, రవి ఉన్నారు.

భైంసాలో భారీ వర్షం

భైంసాటౌన్: పట్టణంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. దాదాపు రెండు గంటలకు పైగా వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రెయినేజీలు పొంగిపొర్లాయి. లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన వర్షపు నీటితో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. టిప్పుసుల్తాన్ చౌక్, వివేకానంద చౌక్ వద్ద రోడ్లపై వర్షపు నీరు ప్రవహించింది.

బీసీల సమస్యలపై పోరాడాలి



మాట్లాడుతున్న అధ్యక్షుడు నారాయణ

నిర్మల్‌టౌన్: బీసీల సమగ్రాభివృద్ధి కోసం ఏకమై తమ సమస్యలపై పోరాడాల్సిన అవసరం ఉందని బీసీ సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షుడు పొన్నం నారాయణగౌడ్ అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని మయూరి హోటల్‌లో బీసీ సంక్షేమ సంఘం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో గాయకుడి మృతి



కిశోర్(ఫైల్)

ముధోల్: మండలకేంద్రానికి చెందిన కిశోర్ (32) అనే యువ గాయకుడు బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. కరీంనగర్ పట్టణంలో ఓ ఫంక్షన్‌కు వెళ్లగా ఒక్కసారిగా గుండెపోటుతో కుప్పకులాడు. ఆసుపత్రికి తీ సుకెళ్లగా చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

సారూ.. మరమ్మతుల జాడేది?

- సారంగపూర్ మండలంలో వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, కల్వర్టులు
- రాకపోకలకు ప్రజలకు తప్పని తిప్పలు
- మరమ్మతులు చేపట్టాలని వేడుకోలు



జామ్-సారంగాపూర్ గ్రామాల మధ్య రోడ్డు దుస్థితి



జామ్-సారంగాపూర్ మధ్య దెబ్బతిన్న వంతెన



చీకటిరేవుకు వెళ్లే దారిలో కోతకు గురైన సీసీరోడ్డు, కల్వర్టు

సారంగపూర్: ఇటీవల కురిసిన భారీవర్షాలకు మండలంలోని బోరిగాం, జామ్, యాకర్‌పెల్లి, కంకెట, వైకుంఠాపూర్ గ్రామాలకు వెళ్లే రోడ్లు, కల్వర్టులు దెబ్బతిన్నాయి. రోజులు గడుస్తున్నా.. అధికారులు మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. జామ్-స్వర్ణ ప్రధాన రహదారిపై సారంగపూర్-జామ్ గ్రామాల మధ్యలో వంతెన ఒక వైపునకు కోతకు గురైంది. అక్కడే ఉన్న లోలెవెల్ వంతెన సైతం సగం వరకు దెబ్బతింది. బోరిగాం గ్రామంలో చీకటి రేవుకు వెళ్లే మార్గంలో సీసీరోడ్డు, కల్వర్టు కోతకు గురై వరదలో కొట్టుకుపోయింది. వంజర్ సమీపంలో వంతెన, కంకెట-వైకుంఠాపూర్ గ్రామాల మధ్యలో లోలెవెల్ వంతెన, జామ్, యాకర్‌పెల్లి గ్రామాల మధ్యలో రహదారి వంతెన వద్ద కోతకు గురైంది.

పరిశీలించిన అధికారులు

ఇటీవల దెబ్బతిన్న వంతెనలు, రహదారులను నాయకులు, అధికారులు పరిశీలించారు. ఇప్పటికీ మరమ్మతులు ప్రారంభం కాకపోవడంతో ప్రజలు దెబ్బతిన్న రోడ్లపైనే ప్రమాదరకంగా ప్రయాణాలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లు, కల్వర్టుల మరమ్మతులు పనులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.

మూగజీవాలకు అందని వైద్యం

- కుంటాల పశువైద్యశాలలో సిబ్బంది కరువు
- ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయిస్తున్న పశుపోషకులు



గేదెకు వైద్యం అందిస్తున్న ప్రైవేట్ వ్యక్తి

కుంటాల: కుంటాల పశువైద్యశాలలో సరిపడా సిబ్బంది లేక మూగజీవాలకు వైద్యం అందడం లేదు. దీంతో పాడిరైతులు ప్రైవేటుగా పశువైద్యం చేసే సిబ్బందిని ఆశ్రయిస్తూ ఇబ్బంది పడుతున్నారు. కుంటాల పశువైద్యశాలలో డాక్టర్, వెటర్నరీ అసిస్టెంట్, అటెండర్ ఉండాల్సి ఉండగా.. పశువైద్యాధికారి ప్రియాంక 45రోజుల శిక్షణ నిమిత్తం కరీంనగర్ వెళ్లగా ఇన్‌చార్జి పశువైద్యాధికారిగా నర్సాపూర్(జి) పశువైద్యాధికారి ముక్తార్ అహ్మద్‌కు బాధ్యతలు అప్పగించారు. వెటర్నరీ పోస్టు ఖాళీగా ఉండగా.. అటెండర్ ఉన్నాడు. బుధవారం కుంటాలకు చెందిన బొంతల సంతోష్ అనే పాడి రైతు తన గేదెను పశువైద్యశాలకు తీసుకురాగా సిబ్బంది ఎవరూ లేరు. దీంతో ప్రైవేట్ వ్యక్తి వచ్చి గేదెకు చికిత్స చేశాడు. ఈ విషయం తెలుసుకున్న ఇన్‌చార్జి పశువైద్యాధికారి.. అవసరమైన మందులను కల్లూరు పశువైద్యశాల నుంచి కుంటాలకు తెప్పించారు.

మండలంలో రెండు పశువైద్యశాలలు..

మండలంలో కుంటాల, కల్లూర్‌లో పశువైద్యశాలలు ఉండగా.. కుంటాల పశువైద్యశాల పరిధిలో 11 గ్రామపంచాయతీలు, కల్లూర్ పశువైద్యశాల పరిధిలోకి నాలుగు గ్రామాలు వస్తాయి. సిబ్బందిని అందుబాటులో ఉంచి పశువైద్య సేవలు అందించాలని పాడిరైతులు కోరుతున్నారు.

ఇళ్ల పనుల పురోగతిపై సమావేశం

ఖానాపూర్: మండలంలోని బాదన్‌కుర్తిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎంపీడీవో రత్నాకర్‌రావు అన్నారు. బుధవారం ఇందిరమ్మ ఇళ్ల పనుల పురోగతిపై బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. పనులు పూర్తయిన వాటికి బిల్లులు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. హౌసింగ్ ఏఈ ఖయ్యుం, కార్యదర్శి సురేందర్, లక్ష్మిరాజం, గంగరాజం, గుడాల రాజన్న, మధు, ఎఫ్ఏ సురేశ్ తదితరులున్నారు.

ఆస్ట్రానమీ ల్యాబ్‌తో విద్యార్థులకు జ్ఞానం

- మంత్రి జూపల్లి కృష్ణారావు



పాఠశాలలో ల్యాబ్ వద్ద టెలిస్కోప్‌లో వీక్షిస్తున్న మంత్రి కృష్ణారావు

సోన్: ఆస్ట్రానమీ(ఖగోళశాస్త్రం) ల్యాబ్ ఏర్పాటుతో విద్యార్థులకు పరిజ్ఞానం పెరుగుతుందని ఎక్సైజ్ శాఖ, ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బుధవారం సోన్ జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన వస్తువులు పరిశీలించారు. ఖగోళశాస్త్రానికి సంబంధించిన ప్రశ్నలు వేసి విద్యార్థుల నుంచి సమాధానాలు రాబట్టారు. ఆస్ట్రానమీ ల్యాబ్ ఏర్పాటు చేసినందుకు అధికారులను అభినందించారు.

దెబ్బతిన్న పంటలు పరిశీలన

అనంతరం గ్రామ శివారులో వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న, వరి, సోయా పంటలను పరిశీలించారు. అధైర్యపడొద్దని.. నష్టపోయిన రైతులకు పరిహారమిచ్చి ఆదుకుంటామని ధైర్యం చెప్పారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్‌కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, డీఈవో భోజన్న, డీఏవో అంజిప్రసాద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



రూ.ఐదు లక్షల చెక్కు అందిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే బొజ్జు

కడెం: కడెం ప్రాజెక్ట్ వరదల్లో గత నెల 16న కొట్టుకుపోయిన కడెం మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన తిప్పరెడ్డి గంగాధర్ కుటుంబానికి అండగా ఉంటామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలో జరిగిన కార్యక్రమంలో గంగాధర్ కుటుంబసభ్యులకు రూ.5 లక్షల చెక్కు అందజేశారు. బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, ఒకరికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు.

చాకలి ఐలమ్మకు నివాళి



కుంటాలలో నివాళులర్పిస్తున్న నాయకులు



భైంసారూరల్: వానల్‌పాడ్‌లో ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



మామడలో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



లోకేశ్వరంలో చాకలి ఐలమ్మ విగ్రహం వద్ద..



ముధోల్‌లో..

జిల్లావ్యాప్తంగా బుధవారం చాకలి ఐలమ్మ వర్ధంతి నిర్వహించారు. ఆమె చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడిన మహనీయురాలు చాకలి ఐలమ్మ అని పలువురు కొనియాడారు. ఐలమ్మ జయంతి ఉత్సవ కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్ పొశెట్టి, రజకసంఘం,బీజేపీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్

పోలీసులకు సన్మానం

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలో గణేశ్ నిమజ్జన వేడుకలను శాంతియుత వాతావరణంలో పూర్తి చేసినందుకు బుధవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో పోలీసులను సన్మానించారు. రాజ్యాంగ పరిరక్షణ వేదిక రాష్ట్ర కార్యదర్శి నూనెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సైలు గంగాధర్, సంజీవ్‌ను శాలువాతో సత్కరించారు. ఇందులో శ్రీనివాస్‌వర్మ, కిషన్‌రావు, రామకృష్ణ, నవీన్‌కుమార్, గంగాధర్ తదితరులు ఉన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాలు తనిఖీ

దస్తురాబాద్: మండలంలోని పెర్కపల్లె, మున్యాల, దస్తురాబాద్‌లో ఫర్టిలైజర్ దుకాణాలను తహసీల్దార్ విశ్వంబర్ తనిఖీ చేశారు. ఎరువుల స్టాక్ వివరాలు, రిజిస్టర్లు పరిశీలించారు. మండలంలోని పీఏసీఎస్‌లకు 20 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని ఆయన పేర్కొన్నారు. సిబ్బంది, తదితరులు ఉన్నారు.

యోగా, ధ్యానంతో ఒత్తిడి తగ్గుముఖం



నిర్మల్‌లో ర్యాలీ తీస్తున్న విద్యార్థులు, వైద్యులు

నిర్మల్‌రూరల్: యోగా, ధ్యానం సాధన చేస్తే విద్యార్థులు ఒత్తిడి బారిన పడకుండా ఉంటారని మానసిక వైద్య నిపుణులు అల్లాడి సురేశ్ పేర్కొన్నారు. బుధవారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి జిల్లాకేంద్రంలోని శివాజీ వద్ద మానవహారం నిర్వహించారు. వీధుల గుండా ర్యాలీ తీశారు. ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా క్రమశిక్షణతో మెలుగుతూ చదువుపై దృష్టి సారించాలని సూచించారు. చంద్రాగౌడ్, మహేందర్, ఆదిత్య, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సోన్: జిల్లా కేంద్రం సమీపంలోని సోఫీనగర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ ఆత్మహత్యల నివారణ దినోత్సవంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరం ఉండి చదువుపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డి.కవిత సమస్యలపై ధైర్యంగా పోరాడాలని యువతకు పిలుపునిచ్చారు. వైస్ ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ అధ్యాపకులు పాల్గొన్నారు.

కుంటాల: సమస్యలకు భయపడి ఆత్మహత్య చేసుకోవద్దని.. ధైర్యంగా ముందుకు సాగాలని మానసిక వైద్య నిపుణులు బంగారు సుధీర్ పేర్కొన్నారు. బుధవారం ఆత్మహత్యల నివారణ దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని సూర్యాపూర్ రైతువేదికలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. టెన్షన్, ఆందోళన, ఒత్తిడి, బాధ ఉన్నప్పుడు దగ్గరివారితో పంచుకోవాలని సూచించారు. ఎంపీవో రహీంఖాన్, ఏపీవో గట్టుపల్లి నవీన్, కార్యదర్శి రాజు, డాక్టర్ కిషన్, శివాజీ పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు



లోకేశ్వరం రైతువేదిక వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

లోకేశ్వరం: మండలం కేంద్రంలోని పీఏసీఎస్‌కు బుధవారం యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతులు రైతువేదిక వద్ద ఉదయం నుంచే బారులుతీరారు. సోయా, వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు ప్రస్తుతం యూరియా అవసరం. దీంతో టోకెన్ల కోసం ఇబ్బంది పడుతూ క్యూలో నిల్చొన్నారు. సొసైటీకి 450 బస్తాలు రావడంతో ఒక్కో రైతుకు కేవలం 2 బస్తాలు మాత్రమే ఇచ్చామని సీఈవో విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు.



ఖానాపూర్‌లో పీఏసీఎస్ కార్యాలయం వద్ద గుమిగూడిన రైతులు

ఖానాపూర్: రైతులకు యూరియా తిప్పలు త ప్పడం లేదు. బుధవారం పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్దకు రెండు లారీల్లో 900 యూరియా బస్తాలు వచ్చాయని తెలియడంతో రైతులు ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకాలతో తరలివచ్చారు. ఎరువుల కొరతను దృష్టిలో ఉంచుకొని అధికారులు ఎకరాకు బస్తా చొప్పున రైతులు పంపిణీ చేశారు. బస్తాలు అందనివారు నిరాశతో ఇళ్లకు వెనుదిరిగారు.

పెంబి: మండలకేంద్రంలోని శ్రీ వెంకటసాయి రైతు సేవా కేంద్రానికి బుధశారం యూరియా వచ్చిందని తెలయడంతో రైతులు బారులు తీరారు.

ఓటరు జాబితా విడుదల



కుభీర్‌లో జాబితా విడుదల చేస్తున్న ఎంపీడీవో

కుభీర్: కుభీర్‌లోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వివిధ గ్రామాల ఓటరు జాబితాను ఎంపీడీవో సాగర్‌రెడ్డి ప్రదర్శించారు. మండలంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల కోసం 86 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయగా 40,685 మంది ఓటర్లు ఉన్నారు. సీనియర్ అసిస్టెంట్ రెహమాన్, జూనియర్ అసిస్టెంట్ బషీర్ తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నూతన ఓటరు జాబితాను ప్రదర్శించారు. ఎంపీడీవో రత్నాకర్‌రావు, సూపరింటెండెంట్ నర్సింహస్వామి, సిబ్బంది ఉన్నారు.

దస్తురాబాద్: మండలకేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయలంలో ఓటరు జాబితాను మండల ప్రత్యేకాధికారి నాగవర్ధన్, ఎంపీడీవో సునీత ప్రదర్శించారు. మండలంలో మొత్తం ఓటర్లు 12,894 మంది ఉండగా పురుషులు 6,240, స్త్రీలు 6,653 మంది ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీవో రమేశ్‌రెడ్డి, సూపరింటెండెంట్ గోపాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శులు రాజశేఖర్, రంజిత్, నర్సయ్య తదితరులు ఉన్నారు.

ఇళ్ల నిర్మాణాలపై విచారణ

దస్తురాబాద్: మండలంలోని దేవునిగూడెం, బుట్టాపూర్ గ్రామాల్లో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను మండల ప్రత్యేకాధికారి నాగవర్ధన్, తహసీల్దార్ విశ్వంభర్ పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేవునిగూడెంలో తొమ్మిది ఇళ్లను, బుట్టాపూర్‌లో రెండు ఇళ్ల నిర్మాణాలను అటవీశాఖ అధికారులు అడ్డుకుంటున్నారని గ్రామస్తులు ఇటీవల గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇంటి పన్నులు, భూరికార్డులను పరిశీలించి నివేదిక అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సునీత, కార్యదర్శి వంశీ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

బకాయిలు చెల్లించాలి

ముధోల్: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్సీ ఉపాధ్యాయులు, సీఆర్టీల పెండింగ్ జీతాలను తక్షణమే విడుదల చేయాలని బంజార సంఘం నాయకులు రాథోడ్ నరేందర్ అన్నారు. బుధవారం మధోల్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆరు నెలలుగా జీతాలు ప్రభుత్వం విడుదల చేయడం లేదని పేర్కొన్నారు.

కేజీబీవీలో మాక్ పోలింగ్

లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని కేజీబీవీలో బుధవారం విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. పాఠశాల వి భాగంలో లీడర్‌గా ప్రణీత, ఇంటర్ విభాగంలో లీడర్‌గా లతిక గెలుపొందినట్లు ఎస్ఓ నవిత తెలిపారు.

పోస్టాఫీస్ సేవలపై అవగాహన

మామడ: పోస్టాఫీస్‌లో అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌పీఎం తిరుపతి అన్నారు. బుధవారం మండలంలోని కొరిటికల్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు పోస్టర్ మేకింగ్, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. హెచ్ఎం వెంకటరమణారెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

కనకాపూర్‌లో నిమజ్జనం

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్‌లో బుధవారం వినాయక నిమజ్జనం నిర్వహించారు. చిన్న, పెద్ద తేడా లేకుండా జోరు వానలో నృత్యాలు చేశారు. అనంతరం చెరువులో నిమజ్జనం చేశారు.

'ఇచ్చిన హామీలు అమలు చేయాలి'

కుంటాల: ఎన్నికల వేళ ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు భూమన్నయాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం కుంటాల ఉన్నత పాఠశాలలో భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. సీపీఎస్ రద్దు చేసి పాత పింఛన్ విధానం పునరుద్ధరించాలని కోరారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ రూపొందించి పీఆర్సీ ప్రకటించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి జె.లక్ష్మణ్, ఎయిడెడ్ పాఠశాలల రాష్ట్ర కన్వీనర్ చుక్కా రావు, వెంకటేశ్వరరావు, కాశీరాం పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు

భైంసాటౌన్: పట్టణంలోని జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థలు, తెలంగాణ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కళాశాలలు, పాఠశాలల్లో ఈ పోటీలు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ బుచ్చయ్య తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ రఘునాథ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజు, అధ్యాపకులు డా ఓం ప్ర కాష్, రామ్ మోహన్, సురేందర్, కిషన్, రాజయ్య, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఖానాపూర్: మానవుని పరిపూర్ణ జీవనంలో కృతజ్ఞత పాత్ర అంశంపై సుర్జాపూర్, మస్కాపూర్, సత్తన్‌పల్లి, ఖానాపూర్ పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎంఈవో సంధ్యా రాణి, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సత్యసాయి సేవా సంస్థల కార్యవర్గ సభ్యులు సత్తయ్య ఉన్నారు.

నోట్‌బుక్‌లు పంపిణీ

లోకేశ్వరం: మండలంలోని బామ్నికే గ్రామానికి చెందిన బర్థిపురం మిథున తన పుట్టినరోజును గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సమక్షంలో బుధవారం జరుపుకొన్నారు. మిథున-సుధాకర్ రూ.4 వేల విలువైన నోట్‌బుక్‌లు, పెన్నులు, పెన్సిళ్లను విద్యార్థులకు అందజేశారు. ఉపాధ్యాయుడు దండే విలాస్ తదితరులు ఉన్నారు.

ఏఐఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ

ఖానాపూర్: మిలాద్ ఉన్ నబీ పురస్కరించుకొని పట్టణంలో బుధవారం ఎంపీడీవో కార్యాలయం నుంచి జగన్నాథ్‌రావు చౌరస్తా వరకు ఏఐఎంఐఎం పార్టీ ఆధ్వర్యంలో నాయకులు ర్యాలీ తీశారు. నాయకులు అఖిల్, షఫీ, అఫ్సర్ తదితరులు ఉన్నారు.

ఏఎంసీ వైస్ చైర్మన్‌కు పితృవియోగం

లక్ష్మణచాంద: నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఈటెల శ్రీనివాస్ తండ్రి భూమన్న బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన అంత్యక్రియలు మండలకేంద్రంలో నిర్వహించారు. శ్రీనివాస్‌ను నాయకులు పరామర్శించారు.

బ్యాంకు వద్ద పొదుపు పాఠాలు



విద్యార్థులతో బ్యాంక్, పాఠశాల సిబ్బంది

కుంటాల: ఎనిమిదో తరగతి సాంఘికశాస్త్రంలోని ద్రవ్యం-బ్యాంకింగ్ అనే పాఠం చెప్పేందుకు మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులను బుధవా రం ఉపాధ్యాయులు కుంటాల యూనియన్ బ్యాంకు వద్దకు తీసుకెళ్లారు. ఈసందర్భంగా మేనేజర్ శ్రీనివాస్ రుణాలు, చెల్లింపులు, పొదుపు, చెక్కులు, బీమా గురించి విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ ఎత్రాజ్ రాజు, సిబ్బంది సురేందర్‌రెడ్డి, సుధీర్, కాసీం, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.